: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 36 | 13-06-2022 | పుటలు : 4


## విద్యార్థుల ప్రయోజనార్థమైన ఎంవోయులను ప్రోత్సహించండి

**10.06.22 (మీడియాసెల్)** విద్యార్థులకు ప్రయోజనార్థమైన అవగాహన ఒప్పందాలను(ఎం.వో.యు) ప్రోత్సహించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథారవు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈసీ హాల్ లో శుక్రవారం యూనివర్సిటీ ఎంవోయు లపై రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీతో క్లిక్ క్యాంపస్, అస్పిరె లీడర్స్, ఇన్ఫోలోబ్ సోల్యూషన్స్ ఇండియ ప్రైవేట్ లిమిటెడ్ వంటి సంస్థలతో అవగాహన ఒప్పందాల వివరాలను ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, బి.బి.అహ్మద్ అలీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజనార్థమైన ఎంవోయులను ప్రోత్సహించాలని అన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు ఉన్నత ఉద్యోగాలను, ఉపాధి అవకాశాలను కల్పించే విధంగా కార్యక్రమాలు ఉండాలని చెప్పారు. నూతన జాతీయ విద్యావిధానంలో ఇండస్ట్రీయల్ కొలాబరేషన్ కు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని గుర్తుచేసారు. దానికి భాగంగా జాతీయ అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకోవాలని, తద్వారా విశ్వవిద్యాలయాలు అభివృద్ధిని సాధిస్తాయని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాల ద్వారా విద్యార్థులకు చక్కని అవకాశాలు ఏర్పడతాయన్నారు. విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలు తమతమ మంత్రిత్వ శాఖలు, సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, డీన్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.పి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు డా.పి.ఉమామహేశ్వరి, బి.బి.అహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

## విద్యార్థులను పూర్తి వసతులతో ఆహ్వానించండి



హాస్టల్ మెయింటినెన్స్ పై ఇంజనీర్లను ఆదేశిస్తున్న వీసీ

**07.06.22 (మీడియాసెల్)**
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో విద్యార్థులకు పూర్తి వసతులు కల్పించి ఆహ్వానించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీలోని ఉమెన్స్ హాస్టల్ ను వీసీ మంగళవారం పరిశీలించారు. యూనివర్సిటీలోని హాస్టల్స్ మెయింటినెన్స్ పనులను ఆయన పర్యవేక్షించారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీర్లును ఆదేశించారు. వసతి గృహంలోని గదులు,భోజనశాల, విశ్రాంతి గదులు,వాటర్ సప్లై మరియు హాస్టల్ నిర్వహణ పనులను వీసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం వేసవి సెలవులలో యూనివర్సిటీ హాస్టల్స్ మెయింటినెన్స్ పనులు చేపట్టామన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని వసతి గృహాలను పూర్తిస్థాయిలో మెరుగుపరచి వసతి గృహాలకు విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. విశ్వవిద్యాలయానికి విద్యార్థులే కీలకమని, విద్యార్థులకు చక్కని వాతావరణంలో విద్యనందించాల్సిన బాధ్యత మనపై ఉందని గుర్తుచేసారు. ప్రస్తుతం విద్యార్థులందరికీ సెలవులు కావడంతో వసతి గృహాలలోని విద్యుత్తు ప్లంబింగ్ వంటి మరమ్మతుల పనులను పూర్తి చేసారన్నారు. విద్యార్థులకు అవసరమైన వసతులను పూర్తిగా సమకుర్చుతున్నామని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఎప్పటికప్పుడు ఇంజనీర్లు పర్యవేక్షించాలన్నారు. హాస్టల్ మెయింటినెన్స్ పై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, యూనివర్సిటీ ఇంజనీర్ డా.కె.నూకరత్నం తదితరులు పాల్గొన్నారు..




### మంచి మాట

**అసహనంతో ఒరిగే ప్రయోజనమేమీ లేదు. ఓర్పువహించండి. విజయం మిమ్మల్ని తప్పక వరిస్తుంది.**

This is the hardest period, but hold fast; in the end the gain is sure if you have patience.

**- స్వామి వివేకానంద**

## సంపాదకీయం



# షేక్స్పియర్

సాహిత్యం రసస్పృష్టి. దానికి ఉపకరణం మానవ జీవితం. ప్రేమపూర్వకంగా ఉండటం. చుట్టుపక్కల వారికి సంతోషం కలిగించేలా జీవించటం. సమయం వస్తే తనను, తన వారిని కాపాడుకోవటానికి పరాక్రమించటం తగినవారి మీద దయచూపటం. చిత్తధర్మాలు అలవరచుకోవడం, అంటే... ప్రేమ, సంతోషం, కరుణ, నిర్వేదం వీటన్నిటినీ మనంత మనంగా మీ, మా అనే భేదం లేకుండా ఆస్వాదించేటట్లు అనుభవించేటట్లు చేయగల మంత్రశక్తే కావ్యజీవితం. అదే సాహిత్యం.

కాళిదాసు శకుంతలకు జరుగుతున్న అన్యాయాన్ని దృశ్యకావ్యంగా చూస్తూ శోకిస్తాం. చివరికి మొదాంతమవుతుంది. వ్యాసప్రోక్తమైన నన్నయ శకుంతల అశరీరవాణి ద్వారా రక్షింపబడినా వివాహానికి సాంఘికామోదం అవసరమనే సందేశం అంతర్లీనంగా ఇస్తుంది. ఆ సందేశం మన హృదయ స్పందన అవుతుంది. షేక్స్పియర్ ఒథెల్లో దెజ్డమోనా గురించి శోకిస్తాం. విషాదాంతంగా స్పందిస్తాం. ప్రేమైకమూర్తిగా దెజ్డమోనా మన హృదయాల్లో ఉండిపోతుంది. అందుకే కవులు ఒక కాలానికి చెందిన వారు కాదు. విశ్వజనీనులు. దేశవిదేశాల భిన్న సంస్కృతుల అవగాహనకు సాహిత్యం ఒక వంతెన.

అల్లూరి సీతారామరాజు చరిత్ర బుర్రకథ ప్రక్రియలో చెప్పాలి. రసాత్మకమైన ఆవేశం అందులో ఉంది. ఆ ప్రక్రియ ద్వారానే స్పందన వీలవుతుంది. భక్తి ప్రపూరితమైన ప్రహ్లాదుని చరిత్ర హరికథగా చెబితే హృదయ స్పందన కలిగిస్తుంది.

మానవ జీవితం నవరసాల సమ్మేళనమంటూ మనిషి విశ్వరూపాన్ని ప్రదర్శించిన రచయిత షేక్స్పియర్. అతడు మానవ జీవితానికి మహాభాష్యకారి. జీవితాన్ని సుఖాంతంగానే కాదు దుఃఖాంతంగా కూడా చూడగలగాలని తన సాహిత్యంతో నేర్పిన మహాకవి. తన రచనల ద్వారా సౌందర్య దృష్టినీ, విజ్ఞాన తృష్ణనీ, మహోన్నత భావోద్రేకాల్నీ, తాత్వికచింతననీ రేకెత్తించి ప్రపంచంలోని ప్రజల్ని సంస్కారవంతులుగా, సౌందర్యారాధన తత్పరులుగా, మమతానుబంధాల్ని పెంచుకునే మానవతా మూర్తులుగా, నాగరకులుగా మలిచేందుకు తపించిన షేక్స్పియర్ ఆంగ్ల సాహితీ యశస్సూక్తం.

ప్రపంచంలో ఎన్ని రకాల మనుషులున్నారో, ఎన్ని ప్రవృత్తులు గల వారున్నారో అన్ని రకాల పాత్రలను సృష్టించారు. వ్యాసుని తర్వాత షేక్స్పియర్ తప్ప మరెవరూ అన్ని పాత్రల్ని సృష్టించే లేదేమో. వాల్మీకి రామాయణం కానీ, షేక్స్పియర్ నాటకాలు కానీ వ్యక్తి, సమాజాల సమ్యక్ సమ్మేళనంగానే మనకు కనిపిస్తాయి. ఆ మహాకవులు తమ కావ్యాల్లో సామాజిక సంఘటనలతో పాటు, అనుభూతి సౌకుమార్యానికి కూడా చోటిచ్చారు. అలాగే ఏదో ఒక వస్తువుని ఆలంబన చేసుకొని అతి సున్నితమైన మానవానుభూతిని ప్రకటించటంలో వారు చూపించిన సాహిత్య కౌశలం అజరామరమైంది.

కవిత్వం ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క రకమైన లక్షణాన్ని కలిగి సమాజంలో ప్రజాజీవితాన్ని స్పందింపజేస్తూనే ఉంటుంది. కవిత్వం యొక్క అంతిమ ప్రయోజనం సామాజికస్పృహ. అదే విశ్వశ్రేయః కావ్యం. జగత్కళ్యాణమే దాని లక్ష్యం. సహృదయుల హృదయ స్పందనమే సాహిత్యానికి గీటురాయి.

# ప్రముఖులను కలిసిన వీసీ జగన్నాథరావు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు మర్యాదపూర్వకంగా కలిసారు. దివంగతనేత డా. వైయస్ రాజశేఖరరెడ్డి చే స్థాపించబడి వై.ఎస్.జగన్మోహనరెడ్డి సహకారంతో విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయంలో సాధించిన అభివృద్ధిని వివరించి, ప్రగతి నివేదికను సమర్పించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించాలని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.



డా. ఎన్.టి.ఆర్. ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.శ్యామ ప్రసాద్ ను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మర్యాదపూర్వకంగా కలిసారు. డా. ఎన్.టి.ఆర్. ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలోని వీసీ కార్యాలయంలో వీసీ శ్యామ ప్రసాద్ ను కలిసిన వీసీ జగన్నాథరావు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. రెండు విశ్వవిద్యాలయాలు ఇటీవల కాలంలో సాధించిన అభివృద్ధి అంశాలను ఇద్దరు వీసీలు చర్చించుకున్నారు.



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్ ను వీసీ జగన్నాథరావు మర్యాదపూర్వకంగా కలిసారు. నాగార్జున విశ్వవిద్యాలయ అధికారులతో వీసీ జగన్నాథరావు సమావేశం అయ్యారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాలు పరస్పర సహకారంతో విద్యార్థులకు ప్రయోజనకరమైన మరియు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నన్నయ విశ్వవిద్యాలయంలో సాధించిన నూతన ఆవిష్కరణలను వివరించారు. నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ, అధికారులు నన్నయ వీసీ జగన్నాథరావును శాలువాతో సన్మానించి అభినందించారు.

# నన్నయ ప్రారంభమైన ఉమెన్ క్రికెట్ జట్టు ఎంపికలు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉమెన్ క్రికెట్ జట్టు ఎంపికలను గురువారం రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి ప్రారంభించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ కు ఉమ్మడి గోదావరి జిల్లాలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల నుండి 70 మంది క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఉమెన్ క్రికెట్ టీమ్ సెలక్షన్స్ ను రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి ప్రారంభించారు. క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపేందుకు విశ్వవిద్యాలయ అధికారులు బ్యాటింగ్ చేసి, బౌలింగ్ చేసి క్రికెట్ జట్టు ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసి దృఢమైన విశ్వవిద్యాలయ మహిళ క్రికెట్ జట్టును ఎంపిక చేయాలని నిర్వాహకులకు సూచించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని దానిని సద్వినియోగం చేసుకుంటూ క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని క్రీడాకారులకు సూచించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో జరుగుతున్న యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ కు ఆర్గనైజింగ్ చైర్మన్ గా ప్రిన్సిపాల్ డా. వి. పెర్సిస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డా. వి. సాల్మన్ దేవానంద్ వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ ఆచార్య ఎస్.టేకి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డా. వి. సాల్మన్ దేవానంద్, సెలక్షన్ కమిటి మెంబర్ పి.శ్యామ్ గంగరాజు మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు

# అగ్నిసాక్షి (ఒక జాతి కన్నీటిగాథ)

## పుస్తకం



నేను ఏదో ఒక జాతికో మతానికో వర్గానికో చెందినదాన్ని కాదు. శతాబ్దాలుగా బానిసత్వం అనుభవిస్తున్న మొత్తం స్త్రీ జాతికి సంబంధించిన ప్రతినిధినీ నేను. మేము భరిస్తున్న ఈ బానిసత్వం ఈ దుఃఖాలను మా నెత్తిన వేసింది మీరేనన్న విషయం మీరు గుర్తు పెట్టుకోవాలి.

పురుషాధిక్య సమాజంలో బానిసల కన్న హీనం బ్రతికిన తన ముందుతరం స్త్రీలను తలుచుకుంటూ రచయిత్రి లలితాంబిక తన 'అగ్నిసాక్షి' నవలలో పలికిన మాటలివి. కేరళలోని నంబూద్రినాయర్ కుటుంబానికి చెందిన రచయిత్రి చాలా కవితలు, కథలు, వ్యాసాలు రాశారు. అయితే సమాజంలో ఆడవాళ్ళ మీద జరిగిన హింస నేపథ్యంలో రాసిన అగ్నిసాక్షి నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడమే కాకుండా జాతీయ, అంతర్జాతీయంగా ఆమెకు మంచి పేరు తీసుకువచ్చింది.

నంబూద్రి కుటుంబాల్లో పెద్దవాడికి మాత్రమే పెళ్ళి చేసుకునే హక్కు ఉంటుంది. మిగిలిన తమ్ముళ్లు ఇతర కులాల స్త్రీలతో, ముఖ్యంగా నాయర్ కుటుంబాలతో సంబంధాలు పెట్టుకునేవారు. ఈ సంబంధాల ద్వారా కలిగిన పిల్లలకు ఇతర నంబూద్రి కుటుంబాల పిల్లలతో సన్నిహితం గా ఉండటానికి వీలులేదు. ఈ కుటుంబాల స్త్రీలకు చదువుకునే హక్కు లేదు. బానిసలకైనా స్వేచ్ఛ ఉంటుందేమో కానీ ఈ కుటుంబాల స్త్రీలకు స్వేచ్ఛ ఊహకు అందని విషయం.


అధికారం, పలుకుబడి ఉన్న ఇటువంటి కుటుంబంలోకి ఉణ్ణి నంబూద్రికి భార్యగా వస్తుంది దేవకి. స్వాతంత్రోద్యమంలో పాల్గొంటున్న కుటుంబం కావడం వలన దేవకి చిన్నతనం నుండే స్వతంత్ర భావాలు, చదువు సంస్కారం అలవడుతాయి. పెళ్లి అయిన తర్వాత కుటుంబంలోని స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలకు దేవకి చలించిపోతుంది. చావుబతుకుల్లో ఉన్న తల్లిని చూడడానికి కూడా దేవకికి నంబూద్రి కుటుంబసభ్యులు ఒప్పుకోరు. పైగా నానహింసలు పెడతారు. దీంతో దేవకి అటువంటి కఠిన షరతులు తట్టుకోలేక గాంధీ ఆశ్రమములో చేరుతుంది.

గాంధీజీ చనిపోయాక నైతిక విలువలు పడిపోయిన ఆశ్రమంలో ఉండలేక హిమాలయాలకు వెళ్లిపోతుంది. ఇక్కడ ఉణ్ణి తననుతాను దేవునికి అంకితం చేసుకునీ పిచ్చివానిగా మారిపోతాడు.

ఈ నవల ఇదే పేరుతో మలయాళంలో చక్కని సినిమాగా వచ్చింది.

ప్రాంతాలు వేరుకావచ్చు, మతాలు వేరుకావచ్చు, భాషలు వేరుకావచ్చు. కానీ ఎక్కడ చూసినా ఇటువంటి కథలే. కాలంతో పాటు కొన్ని కట్టుబాట్లు, ఆచారాలు పోయాయేమో కానీ.. సమాజంలో ఆడవారి మీద అమానుషమైన చర్యలు మాత్రం ఆగడం లేదు. ఆడవాళ్ళ మీద మగ వాళ్ళ ఆలోచనా విధానం నేటికీ అలానే ఉంది. అది నేటి సమాజపు అతి పెద్ద విషాదం.

ఆడవాళ్ళ మీద గౌరవభావాలు చూపుతూ, ఆడవాళ్ల అందరిని




గౌరవిస్తూ ప్రేమాభిమానాలు చూపుతూ ఉండాలని కోరుకుంటున్నాను.

**– బి.సుశాంత్ కుమార్, బి.ఎడ్.అనూర్.**

## అనువాదకుని అనుభూతి

అగ్నిసాక్షి నవలని తెలుగులో అనువదించటం నాకు ఒక మధురానుభూతి. ఉద్యోగరీత్యా కేరళలో ఉన్నప్పుడు 1984లో ఈ నవల గురించి విని పుస్తకం కొన్నాను. మిత్రులు తీసుకెళ్లారు. ఇలా రెండుసార్లు జరిగింది. 1989లో మళ్ళీ కొని చదివాను. సాంస్కృతిక అంశాలు పుష్కలంగా ఉన్న అగ్నిసాక్షి నవల చదువుతుంటే శరీరం పులకించేది. కొన్ని కొన్ని సంఘటనలు చదువుతున్నప్పుడు కళ్లనీళ్ల పర్యంతమై గొంతు గాద్గదమయ్యేది. ఎలాగైనా తెలుగులోకి అనువదించాలని బలమైన కోరిక నాలో కలిగింది. అగ్నిసాక్షి నవలను అనువదించటం కత్తిమీద సాములాంటిది. విషయం, కథన పద్ధతి, భాష, శైలి సర్వ సాధారణమైనవి కావు. ఈ నవలలో స్వాతంత్ర్య విమోచన చరిత్ర ఉంది. సాంస్కృతిక నేపథ్యంలో జాతి కుల సంప్రదాయ శృంఖలాలు తెంచుకోవాలన్న తపనతో వచ్చిన ఉద్యమాల సవ్వడులు, సందేశాలున్నాయి. వీటన్నింటినీ ఒక దగ్గర చేర్చడం అగ్నిసాక్షి నవలలో జరిగింది. ఈ నవలను కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించటం సంతోషం.



**– ఆచార్య ఎన్. భక్తవత్సలరెడ్డి**

# నన్నయలో సివిల్స్‌కు ఉచిత శిక్షణ

**10.06.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలకు ఉచిత శిక్షణను అందించేందుకు 21 సెంచరీ ఎడ్యుకేషన్ సోసైట్ వారు ముందుకు వచ్చారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలో వీసీ ఆచార్య జగన్నాథరావును దూరదర్శన్ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ జనర్, ఎడ్యుకేషన్ సొసైటీ సలహాదారు డా. ఆర్. అనంతపద్మనాభరావు మర్యాదపూర్వకంగా కలిసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వీసీ జగన్నాథరావును అభినందించారు. నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో తాము భాగస్వామ్యం అవుతామని, విశ్వవిద్యాలయంలోని ఆసక్తిగల విద్యార్థులకు సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలకు ఉచిత శిక్షణను అందిస్తామని పద్మనాభరావు అన్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు ఐ.ఎ.ఎస్., గ్రూప్-1 వంటి పోటీపరీక్షలకు శిక్షణను ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నామని సొసైటి వైస్ చైర్మన్ ధరణి తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్వామ్యమవుతూ విద్యార్థులకు సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలకు ఉచిత శిక్షణను అందించాలనే మంచి ఉద్దేశంతో ముందుకు వచ్చిన 21 సెంచరీ ఎడ్యుకేషన్ సోసైట్ డా. ఆర్. అనంతపద్మనాభరావు, ధరణి లను వీసీ అభినందించారు. సివిల్స్ శిక్షణ విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఉచితంగా సివిల్స్ కు శిక్షణను అందించడం చాలా మంచి విషయమని విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే విశ్వవిద్యాలయంలో కమ్యూనిటీ రేడియో స్థాపనకు సహకరించాలని, తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని డా. ఆర్. అనంతపద్మనాభరావును వీసీ కోరారు. విద్యార్థుల ప్రయోజనార్థం విశ్వవిద్యాలయంలో సివిల్స్ శిక్షణను అందించేందుకు ముందుకు వచ్చిన డా. ఆర్. అనంతపద్మ నాభరావును వీసీ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, తెలుగుశాఖాధిపతి డా. కె. వి. ఎన్. డి. వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




డా.ఆర్.అనంతపద్మనాభరావును సన్మానించి అభినందించిన వీసీ

# ఠాగూర్ - వేర్ ద మైండ్ ఈజ్..



ఎక్కడ మనసు
నిర్భయంగా ఉంటుందో,
ఎక్కడ మనుషులు
తలెత్తి తిరుగుతారో,
ఎక్కడ జ్ఞానం విరివిగా
వెలుస్తుందో, ఎక్కడ
ప్రపంచం ముక్కముక్కలై
ఇరుకైన గోడలమధ్య
మ్రగ్గిపోవదో, ఎక్కడ
సత్యాంతరాళం లోంచి
పలుకులు బయలు
వెడలుతాయో, ఎక్కడ
అలసట నెరుగని శ్రమ
తన బాహువుల్ని
పరిపూర్ణత వైపు
జాస్తుందో,
ఎక్కడ నిర్జీవమైన
ఆచారపుటెడారిలో
స్వచ్ఛమైన బుద్ధి ప్రవాహం ఇంకిపోకుండా వుంటుందో,
ఎక్కడ మనసు నిరంతరం వికసించే భావాలలోకీ,
కార్యాలలోకి నీచే నడపబడుతుందో,
ఆ స్వేచ్ఛా స్వర్గానికి,
తండ్రీ! నా దేశాన్ని మేల్కొలుపు!!



**అనువాదం: చలం**

# రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది మహోత్సవాలు -1022-2022









రాజరాజనరేంద్రుడు

1.రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది
2. తెలుగులో భారతావిర్భావానికి వెయ్యేళ్లు
3. రాజమహేంద్రవరం నగరానికి వెయ్యేళ్లు
దేశంలో వెయ్యేళ్ల చరిత్ర ఉన్న నగరాలు – (బెనారస్ , మధురై , తంజావూరు వంటివాటి సరసన చేరేనగరం రాజమహేంద్రవరం)

### ఉపోద్ఘాతం :

చరిత్ర ఒక నిరంతర మేధాప్రక్రియ. అది అన్ని తరాలకు తెలియాలి. చరిత్రను సరైన పునాదుల మీద నిర్మించినప్పుడే జాతి ప్రతిష్ట , ఆత్మగౌరవం నిలబడుతుంది. భారతదేశ గతవైభవం మరే దేశంతోనూ తీసిపోనిది.

తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో రాజమహేంద్రవరం తరతరాలుగా సాంస్కృతిక రాజధానిగా పేరెన్నికగన్నది. దీనికి కారణం తూర్పుచాళుక్యులే. రాజకీయ, భాష, సాంస్కృతిక పరంగా తెలుగు నేలను పరిపాలించిన రాజ వంశాల్లో తూర్పు చాళుక్య వంశం అగ్రగణ్యమైనది.

### తూర్పుచాళుక్యుల గొప్పదనం :

చరిత్రలో చాళుక్య శబ్దం 7వ శతాబ్దం నుండి కనిపిస్తుంది. తూర్పు చాళుక్యులు ఆంధ్రదేశాన్ని సుమారుగా ఐదు వందల సంవత్సరాలు పరిపాలించారని చారిత్రక ఆధారాలు తెలియజేస్తున్నాయి. చాళుక్య భీముడు, గుణగ విజయాదిత్యుడు, రాజరాజ నరేంద్రుడు ఈ ముగ్గురు ప్రసిద్ధమైన వ్యక్తులని ఆంధ్ర దేశ చరిత్ర తెలియజేస్తోంది.

### తూర్పుచాళుక్యుల కాలంలో సాంస్కృతిక వికాసం :

చాళుక్యుల కాలంలోనే చాళుక్య శిల్పరీతులతో పంచారామ దేవాలయాల నిర్మాణం జరిగింది. దీనిని కొనసాగిస్తూ బిక్కవోలు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, వేంగిక్షేత్రంలోని సూర్యనారాయణ స్వామి ఆలయం, పశ్చిమ గోదావరి జిల్లాలోని పండిత గ్రామమైన కాకరపర్రులోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం మొదలైన వాటిని రాజరాజ నరేంద్రుడు నిర్మించాడు. అదేగ్రామంలో ఏనుగుల రావి అనే స్థలంలో ఉన్న రావిచెట్టు కూడా రాజరాజ నరేంద్రుని నాటివే.

నన్నయ భట్టారాకుడు తన భారతంలో అర్జునిని తీర్ధయాత్రల సందర్భంలో దాక్షారామం వచ్చినట్టుగా రాశాడు. నన్నయ సహాధ్యాయి అయిన నారాయణ భట్టు కుమార్తె కుపమ వేయించిన దానశాసనం ద్రాక్షారామంలో కనిపిస్తుంది.

### రాజరాజ నరేంద్రుడు:

రాజరాజ నరేంద్రుడు 1002 లో జన్మించాడు. విమలాదిత్యుడు, కుందవి (రాజరాజచోళుని కుమార్తె) తల్లిదండ్రులు. రాజరాజ నరేంద్రుని తాత దక్షిణాపథంలో గొప్ప చక్రవర్తిగా పేరుగాంచిన రాజరాజచోళుడు.

విమలాదిత్యుని తర్వాత రాజరాజనరేంద్రునికి క్రీ.శ. 1022 ఆగస్టు 16 న పట్టాభిషేకం జరిగింది. తంజావూరు మహారాజు రాజేంద్రచోళుని (మేనమామ) కుమార్తె అమ్మంగదేవితో వివాహం జరగడంతో చోళ, చాళుక్యుల మధ్య బంధం మరింత బలపడింది. ఇతని కుమారుడు రాజేంద్రుడు (కులోత్తుంగ చోళుడు). రాజరాజనరేంద్రునికి ముందు తూర్పుచాళుక్యులు వేంగి (ఏలూరు సమీపంలో ఉన్న- పెదవేగి)ని రాజధానిగా చేసుకుని పరిపాలించారు. రాజరాజనరేంద్రుడు దాయాదులతో మరియు శత్రురాజులతో జరుగుతున్న పోరును తప్పించుకోవడానికి రాజమహేంద్రపురం నగరాన్ని నిర్మించి తనరాజధానిని 1022లో అక్కడకు మార్చాడు. నిరవధ్యనరేశ్వరా...కుమారవిద్యాధరుడు... వంటి ఆయనకున్న బిరుదులు ఆయనకు గల శత్రుభయంకర సామర్ధ్యాన్ని,ఆయనలోని పాండిత్యాన్ని మనకు పట్టిస్తాయి.

### నన్నయ భట్టారకుడు :

రాజరాజనరేంద్రుని ఆస్థాన పండితుడు నన్నయ భట్టు. నన్నయ పూర్వీకులు తెలుగు సంస్కృతభాషలో శాసనాలు రాసినట్టుగా ఆధారాలు లభిస్తున్నాయి. దీనినిబట్టి పండితవంశంలో పుట్టిన నన్నయ తన సంకల్పంతో తెలుగు భాషా సాహిత్యాలకు దిశానిర్దేశం చేశాడని చెప్పవచ్చు.

### నన్నయ వంశక్రమం-

మాధవ భట్టు (వడకలూరు శాసనకర్త ) – పోతన భట్టు (యలవర్రు శాసనకర్త ) – భీమన భట్టు (రణస్థిపూడి శాసనకర్త)– బేతన భట్టు ( కోరుమిల్లి శాసనకర్త ) – నన్నయ భట్టు (నందంపూడి శాసనకర్త )
1053 నందంపూడి దానశాసన కర్త నన్నయ. నారాయణ భట్టుకు దానమిచ్చిన శాసనం.

### తెలుగులో భారతావిర్భావానికి కారణాలు :

రాజరాజనరేంద్రుని ఆస్థానకవి, పురోహితులు, మహారాజునకు అత్యంత ఆత్మీయుడు నన్నయ భట్టారకుడు. రాజరాజ నరేంద్రునికి ఇష్టమైన ఐదు పనుల్లో భారతాన్ని వినడం ఒకటి. మహారాజు తమ పూర్వులు, చంద్రవంశపు రాజులైన కౌరవ, పాండవుల చరిత్ర అయిన మహాభారతం జయ సంహిత పేరుతో సంస్కృత భాషలో ఉందని, తమిళ కన్నడ భాషల్లో అది తర్జుమా అయిందని తెలుగులో కూడా మహాభారతం ఉండాలని...దానిని తెలుగులో రచించాలని నన్నయ మహాకవికి రాజరాజ నరేంద్రుడు ప్రేరణ ఇచ్చాడు. దాని ఫలితమే ఆంధ్ర మహాభారత రచన. అది తెలుగులో ఆదికావ్యంగా నిలిచింది. నన్నయ ఆదికవి అయ్యాడు.

### వాగనుశాసనుడు- కావ్య భాషను రూపొందించినవాడు నన్నయ :

కవిత్వ రచనకు,భాషకు ఒక రూపం ఏర్పడటానికి, ప్రయోగార్హమైన భాషగా తెలుగు శాశ్వతత్వాన్ని పొందటానికి కారణమయ్యాడు నన్నయ. రాజరాజ నరేంద్రుని కోరికమేరకు , నన్నయ మహాభారత రచనకు శ్రీకారం చుట్టి వెయ్యేళ్లు పూర్తయింది. ప్రపంచ భాషాసాహిత్య చరిత్రలో వేయి సంవత్సరాల సుదీర్ఘ సాహిత్యచరిత్ర కలిగిన భాష తెలుగు.

నన్నయ చేతితో శ్రీకారం చుట్టబడి రాజమహేంద్రవరంలో పురుడుపోసుకున్న తెలుగు సాహిత్యం నన్నయ నుంచి నేటివరకూ చాలా ఉధృతంగా ప్రవహిస్తూ రావడం తెలుగు సాహిత్య విశిష్టత.

తెలుగు సాహిత్యానికి శ్రీకారం చుట్టడమే కాకుండా భావికవులకు మార్గదర్శనం చేసిన మహాద్రష్ట నన్నయ. సంస్కృత సాహిత్యానికి వాల్మీకి ఎలా ఆదికవియో తెలుగు సాహిత్యానికి నన్నయ అలాగే ఆదికవి. అందుకే తెలుగులో తొలి జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందిన కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు నన్నయ గారిని "ఋషి వంటి నన్నయ రెండవ వాల్మీకి " అని వాల్మీకితో సమానమైన స్థానాన్ని ఇవ్వడం నన్నయగారి గొప్పదనాన్ని తెలియజేస్తుంది.

### రాజమహేంద్రవరం నగరానికి వెయ్యేళ్లు :

రాజమహేంద్రపురం నగరాన్ని రాజరాజు తన పేరుతో నిర్మించి, తన రాజధానిగా చేసుకుని పరిపాలించాడు. ఈ నాటికీ ఈ నగరం తన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ వస్తోంది. దేశంలోఉన్న అతి పురాతన నగరాలైన బెనారస్ , మధురై , తంజావూరు వంటివాటి సరసన చోటుదక్కించుకోవడానికి అన్ని అర్హతలు ఉన్న నగరంగా దీన్ని చెప్పవచ్చు.

### సహస్రాబ్ది:

ఈ ఏడాది 2022 ఆగస్టు 16 నాటికి రాజరాజనరేంద్ర పట్టాభిషేక మహోత్సవానికి వెయ్యేళ్ళు (సహస్రాబ్ది). తెలుగు భారతం ఆవిర్భవించి వెయ్యేళ్లు(సహస్రాబ్ది). రాజరాజ నరేంద్రుడు నిర్మించిన రాజమహేంద్రవరం నగరవయస్సు వెయ్యేళ్లు (సహస్రాబ్ది). ఈ మూడు విశిష్ట సందర్భాలను కలుపుకొని ఈ మహోత్సవాన్ని తెలుగు ప్రజలు ఘనంగా జరుపుకోవాల్సిన సమయమిది. రాజ మహేంద్రవర పట్టణంలోని రాజరాజనరేంద్రనగర్ లో ఆయన ఆస్థాన పండితుడు ఆదికవి నన్నయ పేరుతో నెలకొన్న విశ్వవిద్యాలయంలో ఈ సహస్రాబ్ది మహోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా మహోత్సవాలుగా నిర్వహించి, గత వైభవాలను స్మరించి వర్తమాన సమాజానికి ప్రేరణ ఇవ్వటం విశ్వవిద్యాలయం తమ బాధ్యతగా భావిస్తుంది. నన్నయ విశ్వవిద్యాలయం 2022 ఆగస్టు 16 న రాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది మహోత్సవాలను నిర్వహించాలని తలపెట్టడం ద్వారా చారిత్రక వైభవాన్ని స్మరింపచేయడం ఈ సమాజానికి, చరిత్రకు ఎంతో అవసరం. దానికి ప్రభుత్వాలు, ప్రజలు, విద్యావంతులు పూర్తి సహకారాలను అందించాలని విశ్వవిద్యాలయం కోరుతోంది. అందరి భాగస్వామ్యంతో ఈ మహోత్సవాలను నిర్వహించాలనేది విశ్వవిద్యాలయ ఆశయం.

## విశ్వవిద్యాలయ ప్రత్యేకతలు :

రాజమహేంద్రవరంలో తెలుగు చరిత్రకు చిహ్నంగా నన్నయ విశ్వవిద్యాలయం ఆవిర్భవించింది. విశ్వవిద్యాలయ ప్రవేశద్వారం చాళుక్య ద్వారం. విశాలమైన విశ్వవిద్యాలయ ప్రాంగణం రాజరాజ నరేంద్రనగర్. విశ్వవిద్యాలయం పేరు "ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం".11 వ శతాబ్దంలోని తూర్పు చాళుక్యుల పరిపాలన వైభవం, ఆంధ్రదేశ చరిత్ర ప్రతిబింబించేలా రాజమహేంద్రవరంలో విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పటం, ప్రభుత్వాలు సహకరించటం, ప్రజల అభీష్టం ఎంతో సంతోషదాయకం

## సహస్రాబ్ది మహోత్సవాల లక్ష్యం :

తెలుగు మహాభారతం పుట్టడానికి ప్రధాన భూమికను ఏర్పరచిన రాజవంశం తూర్పు చాళుక్యులది. మహాభారత రచనకు ప్రేరణ ఇచ్చినది రాజరాజ నరేంద్రుడు. శాతవాహనులు, ఇక్ష్వాకులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర వంశాల గత చరిత్ర ఎంత ఘనమైనదో, అది మిగిల్చిన వారసత్వసంపద ఏమిటో ఇప్పుడున్న తరాలకు తెలియాలి. దాని నుండి సమాజం చైతన్యవంతం కావాలి.

సహస్రాబ్ది ఉత్సవాలకు రాజమహేంద్రవరం చరిత్ర, సంస్కృతి మరియు అభివృద్ధి రంగాలపై ఆసక్తిగల వారంతా తమ సూచనలు, సలహాలు మరియు భాగస్వామ్యాన్ని అందిస్తారని ఆశిస్తున్నాం. మీ సూచనలు సలహాలు rrnmillennium@aknu.edu.in కు మెయిల్ చేయండి.

**ధన్యవాదాలు.**

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in